క్లుప్తంగా

హెల్మెట్‌తో రక్షణ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని జయరామరావువీధిలోని శ్రీచైతన్య పాఠశాల ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఏజీఎం, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేసే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, అకడమిక్ డీన్ శంకర్, ఉపాధ్యాయులు గిరిజ, సురేంద్ర పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో పార్కింగ్ చేస్తే చర్యలు


సత్యవేడు కోర్టు ఆవరణలో స్కూటర్లు

సత్యవేడు : స్థానిక కోర్టు ఆవరణలో వాహనాల పార్కింగ్‌కు అనుమతి లేదని ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. కోర్టు ఆవరణలో కార్లు, స్కూటర్లు పార్కింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.కోర్టు కార్యకలాపాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వాహనాలు దూరంగా ఉంచాలన్నారు. కోర్టు సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను దూరంగా ఉంచాలని సూచించారు.

కొనసాగుతున్న పింక్‌బస్ సేవలు


వైద్య శిబిరానికి హాజరైన వైద్యులు, సిబ్బంది

సత్యవేడు : మహిళలు రొమ్ము కేన్సర్ నిర్ధారణకు మమోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని స్విమ్స్ అంకాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ చైతన్యభాను కోరారు. మంగళవారం పీవీపురం, రాజగోపాలపురంలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మండలంలో పింక్ బస్సు ద్వారా నిర్వహిస్తున్న రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్‌లను గుర్తించేందుకు మహిళలు తప్పని సరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు పోలమ్మ, మధుసూదనరావు, డాక్టర్ అనిత, కార్యదర్శి లీలామాధవ్‌రావు, ఎంపీహెచ్‌ఎస్ రాణెమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ లోకేశ్వరి, ప్రతిమ పాల్గొన్నారు.

దారి సౌకర్యం కల్పించండి


బీఎస్‌పురంలో వినతులను స్వీకరిస్తున్న ఆర్‌ఐ నల్లయ్య

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని భవానీ శంకరపురంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూములకు పట్టాలు, ఇంటి స్థలాలు, మ్యుటేషన్, సర్వే తదితర సమస్యలపై వినతులను డీటీ చంద్రబాబునాయుడు, ఆర్‌ఐ నల్లయ్యకు అందజేశారు. వాటిని పరిశీలించి 30 రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. శ్మశానానికి దారి లేక అవస్థలు పడుతున్నామని దారి సౌకర్యం కల్పించాలని కోరారు.

రికార్డులు పరిశీలించి న్యాయం చేయండి

సత్యవేడు : రెండు రోజుల కిందట జరిగిన ఇరుగుళం రెవెన్యూ గ్రామసభలో ప్రతాప్‌రెడ్డి, మహేష్‌రెడ్డి అనే వ్యక్తులు 475–2లో 73 సెంట్లు భూమిని బి. మురళి బాబు రెడ్డి ఆయన పేరున పాస్‌బుక్ చేసుకొన్నారని ఫిర్యాదు చేశారు. ఆ భూమి బి.మురళీబాబు తండ్రి రామచంద్రారెడ్డి పేరున 1బీలో 475–2లో 73 సెంట్లు ఉందని, తండ్రి ఆస్తిని కుమారుడిగా పిత్రార్జితం కాబట్టే తన పేరున పాస్ బుక్ నమోదు చేసుకొన్నానని బాధితుడు మురళీబాబు పేర్కొన్నారు. తప్పుడు ఫిర్యాదులు ఇస్తే రెవెన్యూ అధికారులు పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

అవగాహన సదస్సు


గుత్తివారిపల్లి విద్యార్థుల ర్యాలీ

రేణిగుంట : రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులపై అవగాహన అవసరమని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రం ప్రాజెక్టు అసోసియేట్ డా.కోనప్రభ పేర్కొన్నారు. 76వ ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గాజులమండ్యం స్వయం సహాయక సంఘం సభ్యులతో ఆమె సమావేశమై అవగాహన కల్పించారు. అలాగే మండలంలోని గుత్తివారిపల్లి హైస్కూల్‌లో ఆకాంక్ష సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిబాబు విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో న్యాయవాది శ్రావణి పాల్గొని విద్యార్థినులకు మానవ హక్కుల పరిరక్షణ గురించి తెలియజేశారు.

రేణిగుంట రైల్వే జంక్షన్‌కు చరిత్రలో ఓ పేజీ ఉంది.. రాష్ట్రంలోనే మొట్ట మొదటి రైల్వే లైన్ రేణిగుంట–పుత్తూరు ఇక్కడే ప్రారంభమైంది. స్వాతంత్ర్య భారతావని ఆవిర్భావానికి పూర్వమే బ్రిటీష్ పాలనలో 1869లో రాష్ట్రంలోనే తొలి రైల్వే లైను ఇక్కడి నుంచి పుత్తూరుకు 14 మైళ్ల దూరం నిర్మించారు. తొలి రైల్వే లైను ఏర్పాటు చేసి జంక్షన్‌గా మారినా వసతులు మాత్రం ఆ స్థాయి ప్రమాణాలు కనిపించడం లేదు. ఇక్కడి నుంచి ప్రతి రోజూ దేశ నలుమూలలకు రైళ్లు నడుస్తున్నా రైల్వే స్టేషన్ అభివృద్ధిని మాత్రం పట్టించుకోకపోవడంతో సౌకర్యాలు అంతంత మాత్రమే ఉన్నాయి.
– రేణిగుంట


రేణిగుంట రైల్వేజంక్షన్


రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలో అరకొర సౌకర్యాలు

చరిత్ర ఘనం.. వసతులు కనం

- ప్రశ్నార్థకంగా రేణిగుంట జంక్షన్ ప్రమాణాలు
- ఇక్కడి నుంచి దేశం నలుమూలలకు రైళ్లు
- అయిదు ప్లాట్ ఫాంలతో సరిపెట్టిన వైనం
- కనిపించని మౌలిక వసతులు

రేణిగుంట రైల్వే స్టేషన్ 1869లో పుత్తూరుకు రైల్వే లైను ఏర్పాటు చేయడంతో ప్రారంభమైంది. కేవలం ఒక్క ప్లాట్‌ఫాంతో ఏర్పాటు చేసిన స్టేషన్ ప్రస్తుతం ప్రధాన జంక్షన్‌గా రూపాంతరం చెంది అయిదు ప్లాట్‌ఫాంలతో రైలు ప్రయాణికులకు సేవలందిస్తోంది. లిఫ్ట్ పని చేస్తున్నా ఎస్కలేటర్ మాత్రం పనిచేయడం లేదు. కేవలం అయిదుగురు ఉద్యోగులతో ప్రారంభమైన ఈ స్టేషన్లో ప్రస్తుతం సుమారు 500 మందికి పైగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

పెరిగిన ప్రయాణికులు

అయిదు ప్లాట్‌ఫాంలతో కూడిన ఈ రైల్వే జంక్షన్‌లో ప్రతిరోజూ సుమారు 70 రైళ్ల వరకు ఆగుతాయి. మొత్తంగా 179 రైళ్లు ఈ స్టేషన్ మీదుగా నడుస్తూ సేవలందిస్తున్నాయి.

ఇక్కడి నుంచి దేశంలోనే ప్రధాన నగరాలైన ముంబై, బెంగుళూరు, చెన్నై, త్రివేంద్రం, ఒడిషా, హౌరా, ఔరంగాబాద్, యశ్వంత్‌పూర్, గోవా, షిర్డీ, పూరి వంటి ప్రధాన నగరాలతో పాటు పుణ్యక్షేత్రాలకు రైళ్లు నడుస్తున్నాయి. ఇక్కడ నుంచి ప్రతిరోజూ సగటున 5 వేల మంది వివిధ ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తున్నారు.


వెయిటింగ్ గదులు సరిపడా లేక స్టేషన్ బయటే నిరీక్షిస్తున్న ప్రయాణికులు

స్టేషన్‌లో వసతులు ఇలా..

రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల వెయిటింగ్ హాళ్లు అయిదు ప్లాట్ ఫాంలలో ఉన్నాయి. ప్రయాణికులు బస చేసేందుకు ప్రత్యేక గదులు మొదటి ప్లాట్‌ఫాంలో ఆరు ఏసీ, 10 నాన్ ఏసీ గదులున్నాయి. అలాగే నాలుగో ప్లాట్ ఫాంలోనూ ప్రయాణికుల బస కోసం ప్రత్యేక గదులున్నాయి. మరుగుదొడ్ల సదుపాయం ఉంది. పార్సిల్ గది, రిజర్వేషన్ కార్యాలయం ఉన్నాయి. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి.

భవనాల ఆధునీకరణ

స్టేషన్‌లో ప్లాట్ ఫాంల ఆధునీకరణతో పాటు స్టేషన్ భవనాలను ఆధునీకరించారు. గతంలో 5వ నెం.ప్లాట్‌ఫాం మీద మొదటి నంబరు ప్లాట్ ఫాంగా రైళ్లు నడిచేవి. అన్ని కార్యాలయాలు అక్కడే ఉండేవి. అయితే రేణిగుంట పట్టణంలోని బస్టాండు ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్లాట్‌ఫాం వద్ద ప్రధాన కార్యాలయం నిర్మించి 2014లో ప్రారంభించారు. 2016 ఫిబ్రవరిలో దీనిని మొదటి ప్లాట్ ఫాంగా మార్చారు.

ఊసే లేని ప్రథమ చికిత్స కేంద్రం

రేణిగుంట రైల్వే జంక్షన్‌లో కనీసం ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు కాలేదు. ప్రయాణికుల్లో ఎవరికైనా అకస్మాత్తుగా జబ్బు చేసినా మరే ఇతర అనారోగ్య కారణాలు తలెత్తినా ప్రమాదాలు జరిగినా కనీసం ప్రథమ చికిత్స చేసే అవకాశం లేని పరిస్థితి. దశాబ్ద కాలంతో పోలిస్తే స్టేషన్ అభివృద్ధి బాగానే జరిగినా ఇంకా చాలా వసతులు మెరుగుపడాలని రైలు ప్రయాణికులు కోరుతున్నారు.

సంతగేటు వద్ద ప్రత్యేక ప్లాట్‌ఫాం నిర్మాణం లేక అవస్థలు

తిరుపతి–చెన్నైకు వెళ్లే రైళ్లు రేణిగుంట స్టేషన్‌లోకి వచ్చి ఇంజన్లు మార్చుకుని వెళుతుండటంతో ప్రతిరోజూ రాకపోకల్లో ఆలస్యంతో పాటు మరిన్ని రైళ్లు ఈ మార్గంలో తిప్పలేని పరిస్థితి. ముఖ్యంగా గరుడాద్రి, సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లు, పాండిచ్చేరి ప్యాసింజర్ రైళ్లు రేణిగుంట స్టేషన్ లోకి రాకుండానే తిరుపతికి వెళ్లేందుకు వీలుగా స్టేషన్ సమీపంలోని సంతగేటు వద్ద ఓ ప్రత్యేక ప్లాట్ ఫాం నిర్మాణానికి నిధులు మంజూరై పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే చెన్నై, తిరుపతి మార్గంలో మరిన్ని రైళ్లు వచ్చే అవకాశం ఉంది.

మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలి



“ ప్రయాణికుల వెయిటింగ్ హాల్‌లో సౌకర్యాలు పెంచాలి. మహిళా ప్రయాణికుల కోసం పోలీసు భద్రతా బలగాలను పెంచాలి. అన్ని ప్లాట్ ఫాంలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ప్లాట్‌ఫాల సంఖ్య పెంచాలి. సమాచార కేంద్రంతో పాటు ప్రయాణికుల కోసం సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.
– రూపేష్, రేణిగుంట

వంతెన పొడిగించాలి



పార్శిల్ కార్యాలయం వైపున్న వంతెనను బయటకు పొడిగించాలి. అక్కడ కూడా లిఫ్ట్, ఎస్కలేటర్లను ఏర్పాటు చేయాలి. లగేజీతో వచ్చే ప్రయాణికులు లిఫ్ట్, ఎస్కలేటర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మొదటికి ఇప్పటికీ పోల్చి చూస్తే అభివృద్ధి జరిగింది. కానీ జంక్షన్‌లో మరిన్ని సౌకర్యాలు పెంచాల్సిన అవసరం ఉంది.
– జయంత్‌కుమార్, విశ్రాంత రైల్వే అధికారి, రేణిగుంట

నాణ్యమైన భోజనం పెట్టాలి


విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా రుచికరంగా పెట్టాలని మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రహ్మణ్యం ఆదేశించారు. మంగళవారం 'సాక్షి' దినపత్రికలో 'ధరలపోటు..ఆరోగ్యానికి చేటు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆయన కాంపాళెం గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా కూరగాయలు, పప్పులను మెనూ ప్రకారం వాడాలని కోరారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని వంట నిర్వాహకులను హెచ్చరించారు. అదే విధంగా వంట గది పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇంటి పట్టాలు మంజూరు చేయండి

సత్యవేడు : మల్లవారిపాళెంలో నివాసం ఉంటున్న 20 కుటుంబాలకు చెందిన గిరిజనులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దారు సుబ్రహ్మణ్యంను కోరారు. మంగళవారం మల్లవారిపాళెంలో సర్పంచ్ నీరజ అధ్యక్షతన తహసీల్దారు ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. స్థానిక గిరిజనులు 20 మందికి ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఒకే ఇంటిలో ఇద్దరు, ముగ్గురు అన్నదమ్ములు వివాహాలు చేసుకొని అవస్థల నడుమ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల సమస్యలు గుర్తించి ఇంటి పట్టాతో పాటు , ప్రభుత్వ గృహాలు మంజూరు చేయాలని విన్నవించారు. పంచాయతీ పరిధిలో నీటి సమస్య నెలకొందని, కొత్త బోరు మోటారు ఏర్పాటు చేయాలని స్థానికులు అభ్యర్థించారు. గ్రామ పరిధిలో పంచాయతీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరిందని, నూతనంగా పంచాయతీ భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో సర్వే డివిజన్ అధికారి నోడల్ ఆఫీసర్ ప్రసాదరావు, ఎంపీడీఓ ఎస్. చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సంజయ్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, మండల సర్వేయర్ చంద్రశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ : గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి దివాకర్ పేర్కొన్నారు. బుచ్చినాయుడుకండ్రిగలోని ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకంపై గర్భిణులకు అవగాహన కల్పించి, వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు ఏఎన్‌ఎం వద్ద వారి పేరును నమోదు చేసుకుని ఎంసీపీ కార్డు పొందాలన్నారు. మొదటి ప్రసవం అయ్యేవారు విధిగా తమ బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్, ఫోన్ నంబరు ఇస్తే వారికి ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం ద్వారా రూ. 5 వేలు వారి ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. గర్భిణులు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేసుకుంటే రక్తహీనత, ఎయిడ్స్ వంటి వ్యాధుల గురించి తెలుస్తుందన్నారు. రెండవ కాన్పులోనూ ఆడ శిశువు జన్మించినట్లయితే రూ. 5 వేలు, జేఎస్‌వై పథకంలో వెయ్యి రూపాయలను అందజేయటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు విద్యాసాగర్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ తిరుపతి జిల్లా అధ్యక్షుడు గండవరం రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు బ్రెడ్లు, పండ్లు, పాలు అందజేశారు.


పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేస్తున్న రామచంద్రారెడ్డి

మాడ వీధుల్లో ఫ్లెక్సీల కలకలం

- ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు


మాడ వీధుల్లో ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు

శ్రీకాళహస్తి : పట్టణంలో ఏడుగంగమ్మల జాతర సందర్భంగా కూటమి రాజకీయ నేతల ఫ్లెక్సీలు ముమ్మరంగా వెలిశాయి. ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత అనేక సమావేశాల్లో మాడ వీధుల్లో ఒక ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేయకూడదని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. అయినా ఆయన హెచ్చరికలను బేఖాతరు చేస్తూ కూటమి నేతలు నాలుగు మాడ వీధుల్లో రాజకీయ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జాతర సందర్భంగా ఆధ్యాత్మిక శోభ ఉండాల్సిన శ్రీకాళహస్తిలో ఈ విధంగా ఫ్లెక్సీలతో నిండిపోవడంపై ఎమ్మెల్యే మాటకు విలువేముందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నారాయణవనం : ఆగి ఉన్న లారీని ఢీ కొన్న వేర్వేరు ప్రమాదాల్లో బైక్‌పై ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందగా మినీ వ్యాన్ ముందు భాగం ధ్వంసమైన ఘటన నారాయణవనంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కడప జిల్లా నుంచి చెన్నై హార్బర్‌కు ముడి ఖనిజాన్ని తీసుకెళుతున్న లారీ మంగళవారం మధ్యాహ్నం నారాయణవనంలోని జాతీయ రహదారి బైపాస్ వద్ద బ్రేక్ డౌన్‌తో ఆగిపోయింది. ఇండికేటర్లను ఏర్పాటు చేయకపోవడంతో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో పుత్తూరు నుంచి మండలంలోని కీళగరంకు వస్తున్న బైకు ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకునే లోపు చెన్నైకి వెలుతున్న మినీ వ్యాన్ లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్ ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృత దేహాన్ని పుత్తూరు ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ జయరామ్ నాయక్ తెలిపారు. పుత్తూరుకు చెందిన మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

అన్నమయ్య శోభాయాత్రను జయప్రదం చేద్దాం


శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వెంకటయ్య

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన భవనం వద్ద మంగళవారం అన్నమయ్య కళాక్షేత్ర పునరాంకిత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాక్షేత్ర పీఠం కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య మాట్లాడుతూ.. బుధవారం జరిగే గీతా జయంతి సందర్భంగా అన్నమయ్య కళాక్షేత్ర పునరాంకిత శోభాయాత్రను జయప్రదం చేయాలని కోరారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో అఖండ హరినామ సంకీర్తన, భజనలు చేసే విధంగా ప్రయత్నిద్దామన్నారు. అదే విధంగా తిరుమల కొండపై కూల్చేసిన అన్నమయ్య భవనాన్ని పునర్నిర్మించుకుందామని వివరించారు. బుధవారం ఉదయం 9గంటలకు బీటీఆర్ కాలనీ 12వ లైన్ అన్నమయ్య కళాక్షేత్రం పీఠం నుంచి టీటీడీ పరిపాలన భవనం వరకు ర్యాలీ చేసి ఈఓకు వినతి పత్రం అందజేస్తామన్నారు. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివనామ సంకీర్తన, నిత్య భజనలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జానపద, కోలాటం, భజన, చెక్క భజన, హరికథ, బుర్రకథ, వీధి నాటకం , డప్పు కళాకారులు, సుధాకర్, రమణమ్మ, వంశీకృష్ణ, రాజారెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

సరస్వతీ కొలువు.. మందుబాబులకు నెలవు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పాఠశాల
- కారిపాకం హైస్కూల్‌కు ప్రహరీ లేక భద్రత కరువు


ప్రహరీ లేని కారిపాకం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాఠశాల ప్రాంగణంలో పడి ఉన్న మద్యం బాటిళ్లు

వరదయ్యపాళెం : పవిత్ర సరస్వతీ నిలయం మందుబాబులకు అడ్డాగా మారుతోంది. ప్రహరీ లేక మండలంలోని కారిపాకం హైస్కూల్‌కు భద్రత కరువైంది. 210 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో పిల్లల భద్రతపై అధికారులు స్పందించడం లేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో నాడు–నేడు ద్వారా ఈ పాఠశాల ఎంపికై పాఠశాల తరగతి గదుల ఆధునీకరణ పనులు చేపట్టారు. ఆ దశగా తరగతి గదులకు నూతన కిటికీలు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రహరీ సైతం మంజూరైనా పనులు ప్రారంభించే సమయానికి ప్రభుత్వం దిగిపోవడంతో ప్రహరీ పనులు అటకెక్కాయి. దీంతో ఆరు నెలలు కావస్తున్నా ప్రహరీ నిర్మాణం గురించి అధికారులు పట్టించుకోలేదు. ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న కారిపాకం పాఠశాలలో ప్రధానంగా విద్యార్థులు ఖాళీ సమయంలో రోడ్డు మీదకు వెళ్లడం, అటువైపు నిత్యం వాహనాలు వెళ్తున్న సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల సమయం ముగిశాక రాత్రి వేళల్లో స్థానిక యువత, ఇతరులు పాఠశాల ప్రాంగణం మందుబాబులకు అడ్డాగా మారుతోంది. దీంతో ఉదయం విద్యార్థులు వచ్చే సమయానికి పాఠశాల ప్రాంగణం తరగతి గదుల వద్ద ఖాళీ మందు బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఉదయాన్నే ఆ బాటిళ్లను తొలగించి తరగతి గదిలోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. సరస్వతీ మాతను తలచుకొని కళ్లకు అద్దుకొని పుస్తకాలు తీయాల్సిన ఆ విద్యార్థులు తరగతిలోకి వస్తూనే చేతితో మందు బాటిళ్లను తీయాల్సిన దురవస్థ రావడంపై విద్యార్థులు లోలోలన తీవ్ర మథన పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

హక్కులను తెలుసుకోవాలి


మాట్లాడుతున్న అధ్యాపకుడు


శ్రీకాళహస్తి : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నరసింహవర్మ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. దాంతో పాటు విధులను పాటించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గంగారామ్, అధ్యాపకులు నాగయ్య, బాపనయ్య, రమేష్, పరంధామయ్య, సునీత, వెంకట నారాయణ, రాజేంద్రుడు, సతీష్, రుద్రమదేవి, సుభాషిణి , విద్యార్థులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం సునీత

రేణిగుంట (ఏర్పేడు) : జిల్లా స్థాయిలో జరిగిన కౌశల్ క్విజ్ ప్రతిభా అన్వేషణ–2024 పోటీల్లో ఏర్పేడు మండలంలోని పాపానాయుడు పేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు జి.తనుష, ఏ. లిఖిత ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం పి.సునీత తెలిపారు. వీరు ఈనెల 29న విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, గైడ్ టీచర్స్ దామోదరంరెడ్డి, సెల్వరాజన్‌ను హెచ్‌ఎం అభినందించారు.

వినతుల స్వీకరణ


సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్‌బాబు

రేణిగుంట : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని రేణిగుంట తహసీల్దార్ సురేష్‌బాబు అన్నారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీ అన్నాసామిపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అలాగే ఏర్పేడు మండలం కాట్రకాయల గుంటలో జరిగిన సదస్సులో తహసీల్దార్ భార్గవి హాజరై 10 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ రోజా రమణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.